: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 48 | 28-08-2023 | పుటలు : 4




అందెను నేడే అందని జాబిల్లి

ఇస్రో టీమ్‌కి శుభాకాంక్షలు!!

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## నన్నయ భారతిలో ఘనంగా సాహిత్య కార్యక్రమాలు



నన్నయ సహస్రాబ్ది పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం "నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రం"లో నన్నయ చిత్రపటావిష్కరణ, గ్రంథావిష్కరణ మరియు జానపద దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలోని నన్నయభారతి దాతలు సమర్పించిన పుస్తక భాండాగారంలో ఏర్పాటు చేసిన సాహిత్య కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు, విశిష్టాతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ హాజరై శీలావీర్రాజు చిత్రించిన నన్నయ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అలాగే డా.బులుసు వేంకట సత్యనారాయణమూర్తి రచించిన "నన్నయ సహస్రాబ్ది" గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథంలోని విశేషాలను డా.బులుసు వేంకట సత్యనారాయణమూర్తి, డా.రెంటాల శ్రీవెంకటేశ్వరరావు సమీక్షించారు. తరువాత రావూరి నరేష్ రచించిన "నారసింహ పలుకు" శతకాన్ని వీసి ఆచార్య పద్మరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని దాతలు సమర్పించిన సుమారు 15 వేల పుస్తకాలతో నన్నయ భారతి అనే విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఇటువంటి సాహిత్య కార్యక్రమాలను చేపట్టిన నన్నయ భారతి కోఆర్డినేటర్ డా.తలారి వాసును అభినందించారు. సాహిత్యం సమాజాన్ని జాగృతం చేస్తుందని, తెలుగు భాషపై పట్టు సాధించాలని తెలియజేసారు. వెయ్యేళ్ళ క్రితం నన్నయను నేటికి స్మరిస్తున్నామంటే ఆయన భాష, సాహిత్యాలకు చేసిన కృషే కారణమన్నారు. విద్యార్థులు తెలుగు భాష, సాహిత్యాలపై పట్టు సాధించాలని చెప్పారు. ఎంతో చక్కని జానపద సాహిత్యం మనకి ఉందని గుర్తుచేసారు. విశ్వవిద్యాలయంలో భాష, సాహిత్య సదస్సులు, కార్యక్రమాలు విరివిగా జరగాలని, దానికి పూర్తి సహాయ సహకరాలను అందిస్తానని అన్నారు. ఉదయించే సూర్యునిలా విద్యార్థులు విద్య, విజ్ఞాన జ్యోతులుగా సమాజంలో వెలగాలని ఆకాంక్షించారు.

నాన్నపై డా.రెంటాల శ్రీవేంకటేశ్వరరావు రచించిన,గజల్ శ్రీనివాస్ పాడిన పాటను గుర్తు చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ సాహిత్యంలోని వివిధ అంశాలను ఒక్క కార్యక్రమంలో నిర్వహించిన నిర్వహకులను అభినందించారు. తాను గోదావరి జిల్లా వాసిగా గోదావరి ప్రాంతంలో ఉన్న జానపద సాహిత్యాన్ని దగ్గరగా చూసానని గుర్తుచేసారు. జానపద పాటలు కష్టాన్ని మర్చిపోవడంకోసం, పనిని సులభతరం చేయడంకోసం, ఉత్సహంతో పని చేయడం కోసం ప్రజల నోట పాటగా తరచూ వినేవారమని అన్నారు. పల్లెల్లోని శ్రమజీవుల కష్టం నుండి పుట్టిన సహజమైన పాట జానపద పాటలని, వాటిని నేటి తరం గుర్తుచేసుకోవాలని తెలియజేసారు. విద్యార్థులు ఎంత ఉన్నత స్థానాలకు చేరుకున్న మన మూలాలను మర్చిపోకూడదన్నారు. తరువాత ప్రపంచ జానపద విశేషాలను డా.తరపట్ల సత్యనారాయణ, నరసింహ పలుకు శతక విశేషాలను రావూరి నరేష్ తెలియజేసారు. డా.సప్పా దుర్గాప్రసాద్ విశ్వవిద్యాలయ అధికారులకు పుస్తకాలను బహూకరించారు. తరువాత డిప్లమా ఇన్ కూచిపూడి విద్యార్థులు జానపద నృత్య ప్రదర్శనను చేసారు. అనంతరం అతిథులను సన్మానించి పుస్తకాలను బహుకరించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ సమన్వయకర్త డా.పి.విజయనిర్మల, నన్నయభారతి కోఆర్డినేటర్ డా.తలారివాసు, అసిస్టెంట్ లైబ్రేరియన్ డా.టి.సింహాచలం, ఫ్యాకల్టీ అసోసియేట్స్ కె.రాజరాజేశ్వరి దేవి, డా.కె.సతీష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



జానపద దినోత్సవ సందర్భంగా కూచిపూడి డిప్లమా విద్యార్థుల నృత్య ప్రదర్శన

## తెలుగు దివస్

### భారత ప్రధాని నరేంద్ర మోడీ సందేశం



ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు.మన్ కి బాత్ లో భాగంగా మాట్లాడిన ఆయన మాతృభాషతో అనుసంధానమైతే మన సంస్కృతి, విలువలు, సంప్రదాయాలతో బంధం ఏర్పడుతుందన్నారు. దేశంలోని వారసత్వ భాషల్లో తెలుగు ఒకటని, తెలుగు సాహిత్యం వారసత్వ సంపదలో భారతీయ సంస్కృతికి సంబంధించిన వెలకట్టలేని అద్భుతాలు ఉన్నాయని, ఆ భాషలోని సాహిత్యాన్ని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేస్తామని ఆయన అన్నారు.

## ఉపకులపతి ఉవాచ




భారత హాకీ క్రీడను ప్రపంచదేశాల్లో చాటిన వ్యక్తి, హాకీమాంత్రికుడు ధ్యాన్ చంద్. ఆగస్టు 29 ఆయన జయంతి. ధ్యాన్ చంద్ నేతృత్వంలో భారత్ పురుషుల జట్టు మూడుసార్లు ఒలింపిక్స్ పతకాలను గెలిచింది. హాకీలో భారత్ కు చారిత్రాత్మక విజయాలు అందించటంతో పాటు ధ్యాన్చంద్ ఎన్నో అరుదైన ఘనతలను సొంతం చేసుకున్నారు. భారత్ పేరు ప్రపంచ పటంలో మారుమ్రోగి పోవటంలో ధ్యాన్చంద్ కీలక పాత్ర పోషించారు. జాతీయ క్రీడగా హాకీ ని ఎంపిక చేయటానికి ధ్యాన్చంద్ పరోక్షంగా కారణమయ్యారు. అందుకనే ప్రతి ఏడాది ధ్యాన్చంద్ పుట్టినరోజైన ఆగస్టు 29న భారత జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ప్రజలభాషలో పత్రికలు,గ్రంథాలు, రచనలు ఉండాలని వ్యవహారిక భాషాఉద్యమం ద్వారా సాధించిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులుగారు. ఇవాళ ప్రజలందరికీ అర్థమయ్యే భాషలో రచనలు,పుస్తకాలు ఉండటానికి కారణం ఆయన చేసిన ఉద్యమ ఫలితమే. అందువల్ల ఆయన జయంతి ఆగస్ట్ 29 న తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

క్రీడలు ఆరోగ్యాన్ని, శారీరక ఉత్సాహాన్ని కలిగిస్తే, భాషా సాహిత్యాలు వికాసాన్ని,మానసిక ఆనందాన్ని కలిగిస్తాయి.

అందరికీ జాతీయ క్రీడాదినోత్సవ,
తెలుగు భాషాదినోత్సవ శుభాకాంక్షలు!!

ఆచార్య కె.పద్మరాజు



జాతీయ క్రీడా
దినోత్సవ శుభాకాంక్షలు!!
హాకీ మాంత్రికుడు...
ధ్యాన్ చంద్ జయంతి
(ఆగస్ట్ 29)



తెలుగు భాషా
దినోత్సవ శుభాకాంక్షలు!!
వ్యవహారిక భాషా ఉద్యమకర్త
గిడుగు రామ్మూర్తి పంతులు
జయంతి (ఆగస్ట్ 29)

# సంపాదకీయం



## భాష

భాష మహిమ మన పూర్వీకులకు బాగా తెలుసు.అందుకనే వారు పొరపాటున కూడా అమంగళకరమైన మాటలను పలకవద్దని చెబుతారు. మధురమైన, శుభకరమైన మాట వలన మంచి జరుగుతుంది.కఠినమైన, క్లిష్టమైన, అసాధ్యమైన పనులు కూడా మధురమైన సంభాషణల వలన సఫలీకృతమౌతాయి.

ఉద్వేగం కలిగించకుండా, ప్రియంగా, హితంగా పలకటం ఒక విధమైన తపస్సు. దానిని 'వాచిక తపస్సు' అంటారు. ఏ భాష అయినా మనిషికి మృదువైన,హితమైన, ప్రియమైన మంచి మాటల్ని జనజీవన వ్యవహారంగా అందించింది. ఆ మాటలతోనే అన్ని భాషల్లోనూ కవిత్వం, పాట, కథ, నవల... ఇవన్నీ పుట్టుకొచ్చాయి.

శబ్దం యొక్క విశిష్టమైన పరిణామమే వాక్కు. అదే భాష.సృష్టికి కారణమైన ప్రణవ నాదమే ఓంకారం. అకార,ఉకార,మకార సంయుక్తాక్షరమది. పరమాత్మ స్వరూపం. పరమేశ్వరుని ఢమరుకం నుండి శబ్దాలు ఏర్పడ్డాయట. మాహేశ్వర సూత్రాలు అంటారు. వాటిలోంచే అక్షరాలేర్పడ్డాయి. అక్షర సమూహమే వాక్కు. అది భాషగా పరిణమిస్తుంది. కొన్ని భాషలకు లిపి ఉంటుంది. లిపిలేని భాషలు ఈ ప్రపంచంలో వేలకొద్దీ ఉన్నాయి.అన్నింటిలోనూ సాహిత్యం ఉంది.

ఏ భాషలోనైనా మాట్లాడే మాటే మనిషి అల్పత్వాన్ని,ఔన్నత్యాన్ని సూచిస్తుంది. ఉన్నతత్వాన్ని సూచించేది మౌనం లేదా సుతిమెత్తని శబ్దాలైతే, ఎక్కువ శబ్దం చేయటం అల్పత్వాన్ని సూచిస్తుంది.పాదాలను అలంకరించిన మంజీరాలు శబ్దం చేస్తుంటే, కంఠహారం చప్పుడు చేయదని కవుల చమత్కారం.

'అల్పుడెపుడు పలుకు ఆడంబరముగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' అంటారు వేమన. ధ్వనించటంలో అల్పమైన కంచును, అనల్పమైన బంగారానికి సాపత్యం చెప్పారాయన.

ఏదేమైనా క్రమశిక్షణ, సంస్కారం, నియమాలతో జీవించేవారిలోంచి శుభప్రదమైన వాక్కులు, పదాలే వెలువడుతుంటాయి. శబ్దార్థ స్వరూపమైన భాషే ఈ లోకాన్ని నడిపిస్తోంది.కాళిదాస మహాకవి రఘువంశం కావ్యంలో ప్రార్థన శ్లోకంగా'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే' అని వాక్కు, అర్థం ఆదిదంపతుల స్వరూపమని వర్ణించారు.

కాబట్టి దైవ స్వరూపమైన భాషను మనలోంచి మంచిమాటలుగా,ఎదుటివారికి మహదానందాన్ని కలిగించేవిగా, సమాజ హితాన్ని, చైతన్యాన్ని కలిగించేవిగా వర్తించటమే మనం చేయదగిన పని.బహుశా భాషా దినోత్సవాల పరమార్థం ఈ కర్తవ్యాన్ని గుర్తు చేయటానికే కాబోలును!!ం

# కాకినాడ క్యాంపస్‌ను విజిట్ చేసిన వీసీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు సందర్శించారు. ప్రిన్సిపల్ డా. ఎం.కమల కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పద్మరాజు మాట్లాడుతూ "భారతదేశం ప్రపంచంలో అన్ని అగ్ర దేశాల కన్నా ముందుగా చంద్రమండలంపై దక్షిణ ధ్రువం వైపు చంద్రయాన్ 3 ఉపగ్రహాన్ని విజయవంతంగా లాండ్ చేసినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు అలాగే యావత్ భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు, రాబోవు కాలంలో విద్యార్థులు ఎదుర్కోబోయే సవాళ్లను అత్యంత చాకచక్యంగా గతంలో చేసిన తప్పిదములు సరిదిద్దుకుంటూ ముందుకి వెళ్లవలసిందిగా ఇస్రోని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు, ఎంఎస్ఎన్ క్యాంపస్ లో నిర్మించనున్న కొత్త మహిళా హాస్టల్ మరియు మొత్తం క్యాంపస్ కు సంబంధించిన ఒక కిలోమీటర్ పొడవు గల అంతర్ రహదారుల అభివృద్ధి పనులపై మరియు కొత్త కోర్సులు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై విద్యార్థులను ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ నకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వై. మనోజ్ దేవా తయారుచేసిన "ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ ప్రమోషనల్ వీడియో" ని ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు బటన్ నొక్కి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యూనివర్సిటీల ఘనతను ప్రజల్లోనికి తీసుకెళ్లడానికి ఈ ప్రమోషనల్ వీడియో వంటివి ఎంతగానో ఉపయోగపడుతుందని అలాగే ఏ విద్యాసంస్థ అయినా గుర్తింపు పొందడానికి ఇలా బ్రాండింగ్ ఇమేజ్ పెంపొందించే కార్యక్రమాలు ఉపయోగపడతాయని త్వరలో మొత్తం యూనివర్సిటీకి సంబంధించి ఒక మంచి వీడియో తయారు చేయవలసిందిగా కొన్ని సలహాలు సూచనలతో మనోజ్ దేవని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, డా. ఎం.పోచయ్య, డా.అజయ్ రతన్, డా.విజయశ్రీ, డా.స్టీఫెన్, డా.హారిక, డా.శ్రీరామరాజు, డా.శ్రీదేవి, డా.గోపి తదితర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు ప్రమోషనల్ వీడియో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని వీడియోని వీక్షించారు.

# రిజిస్ట్రార్‌ను అభినందించిన ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగ సంఘం



నన్నయ యూనివర్సిటీ నూతన రిజిస్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగ సంఘ ప్రెసిడెంట్ మానుకొండ రవిరాజ్. ఈరోజు ఉదయం 10 గంటలకి నన్నయ యూనివర్సిటీలో నూతన రిజిస్ట్రార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ గోడి సుధాకర్ ను ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల ప్రెసిడెంట్ మానుకొండ రవిరాజ్ కలిసి పూలగుచ్ఛంతో సత్కరించారు.ఈ సందర్భంగా నూతన రిజిస్ట్రార్ మాట్లాడుతూ శతాబ్ది చరిత్ర గల ఆంధ్రా యూనివర్సిటీలో అనేకమైన పదవులను చేపట్టి ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేసినట్లుగానే రాష్ట్రంలో అతిపెద్ద యూనివర్సిటీ అయిన నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా దేశంలోనే అత్యున్నత విద్యా కేంద్రముగా అభివృద్ధి చేయుటకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి,యూనివర్సిటీ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణ,డా. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# నన్నయ తెలుగుశాఖ ఆచార్యునికి అకాడెమీ పురస్కారం



నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తూ, ప్రస్తుతం తెలుగుశాఖ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న డా కెవిఎన్ డి వరప్రసాద్ కు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే తెలుగు సంస్కృత అకాడమీ "హంస" పురస్కారానికి ఎంపిక చేసినట్లు అకాడమీ ఛైర్ పర్సన్ డా. నందమూరి లక్ష్మీపార్వతి లేఖద్వారా తెలియజేశారు. ఈ పురస్కారానికి రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన 9 మందిని ఎంపిక చేసినట్టు ఆమె ప్రకటించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ సహాయాచార్యులు డా.కెవిఎన్ డి వరప్రసాద్ కు "తెలుగుభాషాభివృద్ధికి సాంకేతిక కృషి" రంగంలో "హంస" పురస్కారానికి ఎంపిక చేసినట్టు ఆమె ప్రకటించారు. ఈ పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ సంవత్సరం ఆదికవి నన్నయ విద్యాలయంలో జరపనున్నట్టు ఆమె ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పురస్కారానికి ఎంపికైన గ్రహీతలు అందరూ 29 వ తేదీన ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయానికి రావాలని ఆ లేఖలో పేర్కొన్నారు. "హంస" పురస్కారాన్ని పొందిన డా.కెవిఎన్ డి వరప్రసాద్ కు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తో పాటు విశ్వవిద్యాలయ అధికారులు, ప్రిన్సిపాల్స్, డీన్ లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# అద్విక‌ 23 టెక్ ఫెస్ట్ బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ

**26.08.23 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14,15 తేదీలలో "అద్విక 23" జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ ను నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం "అద్విక-23" జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. యూనివర్సిటి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు (14,15 తేదిలలో) నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ "అద్విక-23"ను నిర్వహిస్తున్నారని అన్నారు. అద్విక టెక్ ఫెస్ట్ లో పేపర్ ప్రెజెంటేషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, టెక్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్పో, షర్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రెజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథిసిస్ డిబెట్ వంటి సాంకేతిక కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ తో పాటు కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేస్తున్న విద్యార్థులందరూ దీనిలో పాల్గొనేందుకు అర్హులేనని తెలిపారు. రెండు రోజుల టెక్ ఫెస్ట్ లో పాల్గొనేందుకు ఆన్ లైన్ ద్వారా రూ.200తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అద్విక 23 టెక్ ఫెస్ట్ కు కన్వీనర్ గా ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ గా మేకానికల్ ఇంజనీరింగ్ కోర్సు కోఆర్డినేటర్ బి.లక్ష్మీ వ్యవహరిస్తున్నారని అన్నారు. అడ్వైజరీ కమిటీ మెంబర్స్ గా పి.సురేష్ వర్మ, వి.పెర్సిస్, ఎం.కమలకుమారి, బి.కెజియారాణి, డి.లత మరియు ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్స్ గా కె.శ్రీహర్ష, కె.దుర్గరావు, సిహెచ్.శివరామ, జె.హనుమంతు, బి.సుధాకిరణ్, జి.కీర్తిమరిట మరియు స్టూడెంట్ కోఆర్డినేటర్స్ కార్యక్రమాలను నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ %ఖఎఅబ.వసబ.అఅ% లేదా 7093008482 ద్వారా సంప్రతించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య జి. సుధాకర్, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అద్విక 23 బ్రోటర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు

# విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలల, ప్రత్యేక ప్రాంగణాల ప్రధానాచార్యులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో విద్యా, పరిపాలన కార్యక్రమాలను ప్రధానాచార్యులు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం యూజీ, పీజీ నూతన ప్రవేశాలు జరుగుతున్న నేపధ్యంలో విద్యార్థుల సౌకర్యార్థమై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వివరాలను తెలియజేస్తున్నాం.

## ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల

**ఆచార్య డి.జ్యోతిర్మయి**



విశ్వవిద్యాలయంలోని ఇంగ్లీషు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య డి.జ్యోతిర్మయి ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు. ఆమె డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఉమెన్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్ గా కూడా సేవలందిస్తున్నారు.

## సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల

**డాక్టర్ పి.విజయనిర్మల**



విశ్వవిద్యాలయంలోని జూవాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డా.పి.విజయనిర్మల సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. ఆమె కేంద్ర గ్రంథాలయం సమన్వయ కర్తగా, యూజీసీ కోఆర్డినేటర్ గా కూడా సేవలందిస్తున్నారు.

## ఇంజనీరింగ్ కళాశాల



**డా.పి.వెంకటేశ్వరరావు**

విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా విధులు నిర్వహించిన డా.పి.వెంకటేశ్వరరావు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో కాలేజ్ డవలప్మెంట్ కౌన్సిల్ డీన్ గా సేవలందించారు.

## విద్యా కళాశాల



**డా.కె.సుబ్బారావు**

విశ్వవిద్యాలయంలోని విద్యాకళాశాల అధ్యాపకులు డా.కె.సుబ్బారావు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విద్యాకళాశాల ఆధ్వర్యంలో బి.ఈడీ, ఎం.పి.ఈడీ కోర్సులను అందిస్తున్నారు. ఆయన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ గా సేవలందిస్తున్నారు.

## ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ

**డా.ఎం.కమలకుమారి**



విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డా.ఎం.కమలకుమారి కాకినాడలోని ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కు ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె గతంలో విభాగాధిపతిగా, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ గా సేవలందించారు.

## తాడేపల్లిగూడెం క్యాంపస్

**ఆచార్య టి.అశోక్**



విశ్వవిద్యాలయ ఇంగ్లీషు విభాగాచార్యులు ఆచార్య టి.అశోక్ తాడేపల్లిగూడెం ప్రాంగణ కళాశాలకు ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు. ఆయన గతంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా, కాకినాడ క్యాంపస్ ప్రిన్సిపాల్ గా సేవలందించారు.

## అజరామర అజంతాల భాష

సుధలొలికే మధురిమలతో
తేనేకన్నా తియ్యనైన పద విన్యాసాలతో
పామరులను సైతం అలరించేలా
జన హృదయ గీతాల ఆవిష్కరణకు
శ్రీకారం చుడుతూ
పదాల అల్లికలతో విజ్ఞాన వినోదాన్ని
పంచుతూ
దేశాభాషల్లుతెలుగుభాష లెస్సయని
కృష్ణదేవరాయులచే కీర్తించబడుతూ
అష్టదిగ్గజ కవులచే ఆదరించబడుతూ
అమ్మతనంలోని కమ్మదనాన్ని
అమ్మపాలలోని అమృతాన్నిఅందిస్తున్న
అమృతాలూరు భాష నా తెలుగుభాష
శ్రీశ్రీ సృష్టించిన కవితాకావ్యాఖండికలకు
శ్రీకారమై
ఆటవెలుదులతో అలవోకగా జీవిత
సత్యాలను పలికిన యోగివేమనకు
వేదికయై
అన్నమయ్య కృతులకు ఆకృతియై
నన్నయ్యాదులను రామాయణ, మహా
భారతాదుల గ్రంథ రచనలకు పురికొల్పిన
మహిమాన్విత మహోన్నత భాష నా
తెలుగుభాష
తెలుగువారి సంస్కృతి , సంప్రదాయాలను
నలుదిక్కులా ప్రజ్వలింప చేస్తూ
యాబది ఆరు అక్షరాలతో శత, సహస్ర,
అవధాన కృత్యాల ధారణ గావిస్తూ
నాటికి, నేటికి, ఏనాటికైనా అజరామరమై
నిలిచే ఆంధ్రుల అజంతాల భాష
తెలుగుభాష.

- కమలశ్రీ
(ఆళ్ళ నాగేశ్వరరావు)
తెనాలి.



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెం క్యాంపస్లో క్యాంపస్ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య టి అశోక్ స్వాగతం పలికిన విద్యార్థులు. ఇప్పటి వరకు క్యాంపస్ ప్రిన్సిపాల్ గా సేవలందించిన ఆచార్య కె శ్రీ రమేష్ కు వీడ్కోలు చెబుతూ అభినందనలు తెలిపిన విద్యార్థులు.



## గౌరవ ప్రొఫెసర్‌గా కె.వి.రావు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ గౌరవ ప్రొఫెసర్ గా ఆచార్య కె.వి.రావును నియమిస్తూ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఉత్తర్వులు జారీ చేశారు. కె.వి.రావు విశ్వవిద్యాలయం యొక్క అకడమిక్ మరియు పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తారు. ప్రొఫెసర్ కె.వి.రావు ఆంధ్రా యూనివర్శిటీ కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ లో పని చేసి పదవి విరమణ చేశారు. విశ్వవిద్యాలయ విద్యా పరిశోధన అభివృద్ధికి కృషి చేయాలని వీసీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు




## అనుబంధ ఆచార్యునిగా ఎస్.వి.ఎల్.నరసింహం



ఆచార్య ఎస్.వి.ఎల్.నరసింహం ను, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యునిగా నియమిస్తూ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ ఆటోమేషన్ సెల్ మరియు డిజిటల్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. సెల్స్ అధికారిగా ప్రొఫెసర్ ఎస్.ఎల్.వి.నరసింహం ను నియమించి బాధ్యతలను అప్పగించారు. ఆయన ఆదేశాలు మరియు మార్గదర్శకత్వంలో నడపబడతాయన్నారు. నరసింహం జెఎన్‌టియు-హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో పనిచేసి పదవీ విరమణ చేశారు. యూనివర్సిటీ ఆటోమేషన్ కు, సాంకేతిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నరసింహం సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని వీసీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, పరీక్ష విభాగం అధికారులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా జయంతి

**(ఆగస్టు 26)**



మదర్ థెరిసా
నీ దేశం కాదు.... నీ మనుషులు కారు
పేదరికంతో, ప్లేగు వ్యాధితో బాధపడుతున్న నా
దేశాన్ని చూసి కదిలిపోయావు
ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నావు
మా మనుషులపై మానవత్వం చూపించావు
నీ జీవితాన్ని పరుల కోసం అంకితం చేశావు
అందరికీ అమ్మలా ప్రేమను పంచావు
అభాగ్యులు,అనాధలు, రోగగ్రస్తులకు అమ్మలా
మారావు
అందుకే ప్రపంచమంతా నిన్ను మదర్ థెరిసాగా
పిలిచింది
ఏ అమృత ఘడియల్లో నా దేశంలో అడుగు
పెట్టావో కానీ.....
"ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు
మిన్న"
"నోటి మాట కన్నా చేతలే మిన్న" అని
నిరూపించావు
తనువు చాలించిన ఇంకా మా అందరి గుండెల్లో
నిలిచిపోయావు
నీ స్పర్శతో పులకించిన మా జీవితం ధన్యం
నీ జీవితం గొప్ప స్ఫూర్తి!!

౨- బి.సుశాంత్ కుమార్

# విద్యా సుగంధాలతో విజయప్రస్థానం!

(ఫేర్వెల్ పార్టీస్)

## కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఫేర్వెల్





## ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ ఫేర్వెల్






## తెలుగువిభాగం విద్యార్థుల వీడ్కోలు








## శరచ్చంద్రిక

### శ్రీశ్రీ కవిత నుండి.....

మానవుడు పెరుగుతున్నాడు పరిసరాలనర్థంచేసుకుంటున్నాడు
ప్రకృతి శక్తులను జయిస్తూ ఘనవిజయాలు సాధిస్తున్నాడు.

ఏమో బహుశా త్వరలో
మీ ఇంటికే రావచ్చు మేము స్వాగతం ఇస్తావు కదూ?
అతిథ్యానికర్హులమే మేము

చంద్రమండలానికి ప్రయాణం సాధించరాని స్వప్నంకాదు
గాలికన్న బరువైనవస్తువుని
నేలమీద పడకుండా నిలబెట్టలేదూ?

పరమాణువు గర్భంలోని
పరమ రహస్యాలూ
మహాకాశ వాతావరణంలోని మర్మాలు తెలుసుకున్నాక

సరాసరి నీ దగ్గరికే
ఖరారుగా వస్తాంలే
అప్పుడు మా రాయబారుల్ని అదరిస్తావు కదూ నువ్వు?

పదార్ధ విజ్ఞానశాస్త్రం
అమోఘంగా వికసిస్తోంది
ప్రాణం స్వభావం ఏమిటో పరిశోధనలు సాగుతున్నాయి
........
........
శరత్కాల గగనంలో
చందమామ కనిపిస్తే
సరదాగా కొంతసేపు
సంభాషణ సాగించా.

**శ్రీశ్రీ**
**(కృష్ణాపత్రిక 1954 అక్టోబర్ 23)**

**2023 ఆగస్ట్ 23**

**జాబిల్లిపై దిగ్విజయంగా చంద్రయాన్ - 3 ల్యాండింగ్**

**చందమామ అందిన రోజు! భరతజాతి మురిసిన రోజు!!**

**శుభాకాంక్షలతో....**

**- నన్నయవాణి**

## అద్వితీయ ఉద్యమగీతాలు




భరతఖండంబు చక్కని పాడియావు,
హిందువులు లేగ దూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు
బిగియగట్టి!

**- చిలకమర్తి**

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

**- గురజాడ**

ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమిభారతిని
నిలుపరా నీజాతి నిండుగౌరవము

**- రాయప్రోలు**

మాకొద్దీ తెల్లదొరతనము దేవ
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించె
పన్నెండు దేశాలు పండుచున్నాగాని
పట్టెడన్నమె లోపమండి
ఉప్పు ముట్టుకుంటే దోషమండి నోట మట్టికొట్టి పోతాడండీ

**- గరిమెళ్ళ**

వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వడొ తెల్పుడీ!
పూసిపోదుము,మెడనువైతముపూలదండలు భక్తితో.....


**- త్రిపురనేని**

జయజయజయ ప్రియభారత
జనయిత్రీ దివ్యధాత్రి
జయజయజయ శత సహస్ర నారనారీ హృదయ నేత్రి

**- దేవులపల్లి**

## అమెరికా సదస్సులో నన్నయ అలుమ్ని నాగేంద్రకిషోర్





అమెరికాలో జరిగిన సైకలాజికల్ అసోసియేషన్ అంతర్జాతీయ కన్వెన్షన్ లో నన్నయ స్పృహ అలుమ్ని అధ్యక్షులు, క్రీడా పరిశోధకులు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ పాల్గొని నిష్ణాతులైన సైకాలజిస్టులను కలుసుకున్నారు. పలు అంశాలపై తులనాత్మక అధ్యయనంపై అవగాహన పెంపొందించుకున్నారు.నన్నయలో నవంబర్ 29,30లలో జరగబోయే ఇంటర్నేషనల్ కమ్యూనిటీ సైకాలజీ సెమినార్ బ్రోచర్ను ప్రొఫెసర్ కెవిస్ బ్రూకిన్స్, పూర్వపు అధ్యక్షులు వెయిట్ ఫ్లో, బ్రాడ్లీ విల్సన్ తదితర కార్యనిర్వాహక సభ్యులకు బహూకరించారు. స్పృహ సైకాలజీ చేపట్టిన వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. ఆనందకర శాంతియుత ఆరోగ్య జీవనానికి సైకాలజిస్టుల అవసరం వారి పాత్ర విద్యా ఉద్యోగ అవకాశాలు సమస్యలు తదితర అంశాలపై విషయపరిజ్ఞానాన్ని అక్కడ చర్చించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, సైకాలజీ అధ్యాపకులు, స్పృహ సైకాలజీ సభ్యులు నాగేంద్ర కిషోర్ కు అభినందనలు అందించారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in